
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 11 మే 2023
5
ఏలూరు



చినవెంకన్నకు రూ.3.70 కోట్ల ఆదాయం



ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్నకు యాత్రికుల విరాళాల ద్వారా రూ.3,70,03,230 ఆదాయం లభించిందని ఆలయ ఇఒ వేండ్ర త్రినాధరావు తెలిపారు. ఆలయ హుండీలను బుధవారం ఉదయం అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్య లెక్కించారు. ఈ లెక్కింపులో నగదు రూపేణా పైన పేర్కొన్న మొత్తం, బంగారం 804 గ్రాములు, వెండి పది కేజీల 705 గ్రాములు, పాత రూ.500 నోట్లు 19, రూ.వెయ్యి నోట్లు తొమ్మిది, విదేశీ కరెన్సీ సైతం లభించిందన్నారు. 40 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఇఒ తెలిపారు.

ఫిర్యాదిస్తే పరిష్కారమే


అర్జీదారులను సంతృప్తిపరచడమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యం

1902 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

అర్జీల పరిష్కారంలో మూడో స్థానంలో జిల్లా

రైతుల ఖాతాల్లో రూ.297 కోట్లు ధాన్యం సొమ్ము జమ

విలేకరుల సమావేశంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అర్జీదారుడు ఫిర్యాదు అందిస్తే నూరుశాతం పరిష్కారమే లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కోర్టు పరిధిలో పరిష్కారమయ్యే సివిల్ తగాదాలు, రోడ్డు వేయడం వంటి నిధులతో ముడిపడిన సమస్యలు వంటివి మినహా ప్రతిసమస్యను వేగవంతంగా నాణ్యంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని, 1902 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేసి అర్జీదారులు ఫిర్యాదు చేయొచ్చున్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. అర్జీల ద్వారా పరిష్కారంకాని సమస్యలను జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా 24/7 పనిచేసే 1902 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి తెలపొచ్చున్నారు. అంతేకాకుండా ఈమ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను సమీపంలోని సచివాలయాల్లోను, సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలోను అందించవచ్చున్నారు. టోల్ ఫ్రీ నెంబర్ నెట్ వర్క్ బిజీ అని వచ్చిన సమయంలో జెకెసి వెబ్ సైట్‌లో వెళ్లి ఫిర్యాదుదారుని ఫోన్ నెంబరు, సమస్య చెబితే తిరిగి వారికి ఫోన్ కాల్ వచ్చి వివరాలను స్వీకరిస్తారన్నారు. ముఖ్యమంత్రి పేషి నిర్వహిస్తున్నందున ఈ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అర్జీదారులకు సంతృప్తిస్థాయిలో పరిష్కరించడంలో ఈ జిల్లా రాష్ట్రంలో మూడోస్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్పందన గ్రీవెన్స్ కంటె మరింత మెరుగ్గా అర్జీల పరిష్కారం అందుతుందన్నారు. ఇందులో 1902 కాల్స్ స్వీకరణ, ఐవిఆర్ఎస్ ఎస్ఎంఎస్ సందేశంతో మల్టిపుల్, ఫీడ్ బ్యాక్, అప్ డేట్ సమాచారం ఎప్పటికప్పుడు హెల్ప్ డెస్క్ కంట్రోల్ రూం నుండి అందుతుందన్నారు. ఫోన్ కాల్స్ ద్వారా అందిన ఫిర్యాదులను సిఎం జగన్ స్వీయ పరిశీలనలో సిఎంఒ స్థాయి నుండి నేరుగా సచివాలయాల పరిధిలోని ఆయా శాఖల విభాగాల వరకు సీనియర్ అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పరిష్కారం చూపుతారన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు ఇప్పటికే ఏర్పాటు చేసిన జిల్లా, మండలస్థాయి ఆడిట్ టీములు ప్రత్యేకంగా రూపొందించిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ మేరకు సమస్యలను పరిష్కరించేందుకు కృషి జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి వాటిని పొందడంలో ఏవైనా ఇబ్బందులున్నా, అవాంతరాలు ఎదురైనా సమస్యలను చెప్పొచ్చన్నారు.

ప్రతీరోజు స్పందన గ్రీవెన్స్ పై సమీక్ష

నిత్యం ఉదయం 8.45 గంటల నుండి 9.30 గంటల వరకూ జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి స్పందన, గ్రీవెన్స్ తదితర అంశాలపై సమీక్షిస్తామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్పందనలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పరిష్కారంపై, వివిధ పత్రికల్లో ప్రచురించబడే ప్రతికూల వార్తాంశాలు, వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించి ఆయా అధికారులతో సమీక్షించి నూరుశాతం నాణ్యతతో అర్జీదారుడు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్య పరిష్కారం సరైన రీతిలో జరగనట్లు గుర్తిస్తే తొలిగా షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నామని ఇదే క్రమంలో మూడు నోటీసులు జారీ అయితే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయంలో ఇప్పటికే ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. స్పందనలో అందే అర్జీల్లో సివిల్, భూ సంబంధిత వివాదాలు ఎక్కువగా అందుతున్నాయని వాటిలో ప్రయివేటు భూములకు సంబంధించి ఎక్కువగానే ఉంటున్నాయన్నారు. ఇలాంటి విషయంలో సంబంధిత తహశీల్దారు ఆధ్వర్యంలో సర్వే చేయించి, అందుకు సంబంధించిన సమాచారాన్ని ఫిర్యాదుదారునికి అందించి జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా ప్రతీవారం క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏ రోజైతే ఏ ప్రభుత్వ సంస్థను తనిఖీ చేయాలన్నది సంబంధిత అధికారికి ఆ రోజున తెలియజేస్తామన్నారు. ఈ విధంగా ఇప్పటికే అంగన్‌వాడీ తదితర వ్యవస్థలు ఒక క్రమపద్ధతిలోకి వచ్చాయన్నారు.

రూ.297 కోట్లు ధాన్యం సొమ్ము చెల్లింపు

ఏలూరు జిల్లాలో ప్రస్తుత రబీ పంటకు సంబంధించి ఇంతవరకూ రూ.320 కోట్ల విలువైన 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇప్పటి వరకూ 93 శాతం రూ.297 కోట్ల చెల్లింపులు సైతం జరిగినట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం సేకరించిన 21 రోజుల్లోపే రైతుల ఖాతాలకు సొమ్ము జమచేశామన్నారు. ధాన్యం సేకరణలో తొలుత 75 సంచుల పరిమితిని రైతుల విజ్ఞప్తి మేరకు 105కు ప్రభుత్వం పెంచిందన్నారు. జిల్లాలో 136 రైతు భరోసా కేంద్రాల ద్వారా నిత్యం ఎనిమిది నుంచి 11 వేల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇందుకు నిత్యం 400 నుంచి 500 వరకు లారీలు, ట్రాక్టర్లు రవాణా సదుపాయం కోసం వినియోగిస్తున్నామన్నారు. రవాణాకు రూ.కోటి ట్రాన్స్ పోర్టర్లకు అడ్వాన్స్ కూడా చెల్లించామన్నారు. జిల్లాలో అకాల వర్షాలకు ఎగువ, మెరక ప్రాంతమైన చింతలపూడి, జంగారెడ్డిగూడెం, ముసునూరు మండలాల్లో నూక శాతం అధికంగా ఉన్న కారణంగా ధాన్యాన్ని కృష్ణా జిల్లాలోని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలింపునకు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు రైతుల వద్ద నుండి కొనుగోలు చేసినప్పటికీ ఇంకా చాలా ధాన్యము రైతుల వద్ద ఉందని, రైతు శ్రేయస్సు దష్ట్యా ప్రభుత్వం మరో 50 వేల మెట్రిక్ టన్నుల అదనపు లక్ష్యం నిర్దేశించారన్నారు. దీంతో మొత్తం ధాన్యం లక్ష్యం 2.50 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందన్నారు. సిఎంఆర్ కోసం కొనుగోలు చేసిన గోనె సంచుల్లో 40శాతం వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. అదేవిధంగా పన్నెండున్నర ఎకరాలకు మించి సాగు చేసిన పెద్ద రైతుల నుంచి కూడా ధాన్యం సేకరణ చేయాలని నిర్ణయించామన్నారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలుకు లక్ష్యాన్నికూడా నిర్దేశించి కొన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. మార్కెఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు జరుగుతుందన్నారు. జెసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనలో ధాన్యం సేకరణపై రైతులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఐదు మండలాల్లో ధాన్యం ఎక్కువగా వచ్చిందన్నారు. మెట్టప్రాంతంలో ఎక్కువ నూకశాతం కనిపించిందని, అందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 50 లక్షల వరకూ గోనె సంచులు సరఫరా చేశామన్నారు. మిగిలిన ధాన్యం కొనుగోలులో ఇబ్బంది లేకుండా రవాణా, గోనె సంచులు తదితర ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మంజుభార్గవి, డిఎస్ఒ ఆర్ఎస్ఎస్.రాజు, డిపిఒ విజయలక్ష్మి, డిఎల్‌డిఒ రమణ పాల్గొన్నారు.

తడిసిన పంటలను ప్రభుత్వమే కొనాలి

నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

రైతాంగ సమస్యలపై దశలవారీ పోరాటం

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అకాల వర్షాలకు తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలను ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం, మొక్కజొన్న కొనుగోలులో సమస్యలు ఎంత తీవ్రంగా ఉన్నాయో మంత్రులను, ఎంఎల్ఎలను రైతులు నిలదీస్తున్న తీరే ఇందుకు నిదర్శనమని చెప్పారు. వర్షానికి ధాన్యం తడిసి మొలకలు వచ్చిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దృష్టికి రైతు తీసుకెళితే 'ఎర్రిపప్ప ధాన్యం తడిసిపోతే నేనేం చేస్తా' అంటూ రైతులను అవహేళన చేయడం దారుణమని విమర్శించారు. ఎర్రిపప్ప అంటే బుజ్జి నాన్న అని మంత్రి అర్థం చెప్పడం మరీ విడ్డూరంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిష్కరించకుండా రైతులపై ఆగ్రహం వ్యక్తం చేయడం ప్రజాప్రతినిధులకు తగదన్నారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందని రైతులకు గోనె సంచులు ఇవ్వడం లేదని, రవాణాకు లారీలు ఏర్పాటు చేయడం లేదన్నారు. రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతూ టార్గెట్లు నిర్ణయించడం ఏమిటని ప్రశ్నించారు. అకాల వర్షాలకు తడిసి రంగు మారిన, మొలకెత్తిన పంటలు సైతం కొనుగోలు చేస్తామని ప్రకటనలు చేస్తూ ఆచరణలో ఆదేశాలు ఇవ్వకుండా ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు. తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంటల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని కోరారు. పంట నష్ట పరిహారం తక్షణం అందించాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని రైతాంగ సమస్యలపై దశల వారీ పోరాటం చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నెల 12వ తేదీ నుండి 31 వరకూ రైతాంగ సమస్యలపై ఇంటింటికీ రైతు సంఘం పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు కట్టా భాస్కర్‌రావు, సిరిబత్తుల సీతారామయ్య, గుండపనేని సురేష్, అనుమోలు మురళీ, గంటా పాపారావు వివిధ మండలాలనికి వచ్చిన రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు 3,277 మంది హాజరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన పాలిసెట్-2023 పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక సర్ సిఆర్ రెడ్డి కళాశాలలో పాలిసెట్-2023 పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్ష నిర్వహణకు ఏలూరులో ఎనిమిది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు 3,715 మంది అభ్యర్థులు హాజరు కావల్సి ఉండగా 3,277 మంది హాజరయ్యారన్నారు. వీరిలో 2,078 మంది బాలురు కాగా, 1,199 మంది బాలికలు అని తెలిపారు.


స్టాంపు పేపర్లే అక్కర్లేదు

ఈ - స్టాంపింగ్ అయినా చట్టబద్ధమే

ఏలూరు రేంజ్ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డిఐజి కె.అబ్రహం

ప్రజాశక్తి - ఏలూరు

అఫిడవిట్లకు, అగ్రిమెంట్లకు, దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు స్టాంపు పేపర్లే అక్కర్లేదని, ఈ- స్టాంపింగ్ అయినా చట్టబద్ధమేనని ఏలూరు రేంజ్ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డిఐజి కె.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. అఫిడవిట్లకు, అగ్రిమెంట్లకు, దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు ప్రజలు సాంప్రదాయకంగా నాన్ జుడీషియల్ స్టాంపులను వాడటం పరిపాటి అని, నాన్ జుడీషియల్ స్టాంపులకు సమాంతరంగా స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ వారిచే ఈ-స్టాంపింగ్ విధానం ఇటీవలే ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ-స్టాంపింగ్ విధానంలో కూడా ప్రజలు తమకు అవసరమైన నాన్ జుడీషియల్ స్టాంపులను పొందవచ్చన్నారు. ఈ స్టాంపింగ్ ద్వారా వేయబడిన స్టాంపులు, సాధారణ నాన్ జుడీషియల్ బాండు పేపర్లతో సమమైన చలామణీ గలవన్నారు. వీటిని దస్తావేజుల రిజిస్ట్రేషన్ నిమిత్తం కూడా నిరభ్యంతరంగా వాడుకోవచ్చన్నారు. ఈ- స్టాంపింగ్ ద్వారా స్టాంపుల అమ్మకం లైసెన్సుల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకుంటే, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ వారు సత్వరమే లైసెన్సులు మంజూరు చేస్తున్నారన్నారు. పైగా, దస్తావేజులను నాన్ జుడీషియల్ స్టాంపుల మీద రాసుకున్నా, ఈ స్టాంపింగ్ ద్వారా ముద్రలు పొందినా రిజిస్ట్రేషన్‌కు అనుమతించేలా సబ్ రిజిస్ట్రార్లందరికీ మార్గదర్శకాలు ఇప్పటికే జారీ చేశామన్నారు. మీ సమీపంలోని ఈ-స్టాంపింగ్ కేంద్రాల, లైసెన్స్ వెండర్ల అందుబాటు వివరాలను www.registration.ap.gov.in, http://www.shcilestamp.com తెలుసుకోవచ్చన్నారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకుల్లో వాడకంలో ఉండి, సులువుగా, వేగంగా, వెంటనే పూర్తయ్యే ఈ-స్టాంపింగ్ విధానాన్ని ప్రజలు విరివిగా వినియోగించుకోవాలన్నారు.



త్రిసంధ్యాదేవిని అభినందిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

దేవాదాయ శాఖ అధికారిగా త్రిసంధ్యాదేవి

వెల్లమిల్లి గ్రేడ్-5 సెక్రటరీ ఘనత

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పోటీ పరీక్షల్లో తన సత్తా చూపించిన ఉంగుటూరుకు చెందిన పాండ్రాకుల త్రిసంధ్యాదేవి దేవాదాయ ధర్మాధాయ శాఖలో ఇఒ పోస్టుకు ఎంపికయ్యారు. 2022లో ఎపిపిఎస్‌సి నిర్వహించిన పరీక్షల్లో రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాశారు. పిలిమనరీ ఫలితాల్లో మూడు వేల మంది అభ్యర్థులు విజయం సాధించగా అందులో సంధ్యాదేవి అర్హత సాధించారు. మళ్లీ 2023 ఫిబ్రవరిలో విజయవాడలో నిర్వహించిన ఎపిపిఎస్‌సి మెయిన్స్ పరీక్షల్లో ఈ మూడు వేల మందిలోంచి రాష్ట్రవ్యాప్తంగా 59 మంది అభ్యర్థులు ఎంపికైన జాబితాలో త్రిసంధ్యాదేవి ఉన్నారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాధాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను కలిసి ఆశీస్సులు పొందారు.

ప్రాథమిక విద్య అంతా ప్రభుత్వ పాఠశాలే


పాండ్రాకుల త్రిసంధ్యాదేవి తల్లిదండ్రులు మధ్యతరగతి కుటుంబం. ఆమె ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉంగుటూరు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివారు. ఇంటర్ తాడేపల్లిగూడెం ప్రయివేట్ కాలేజీలో చదివి బీటెక్ జంగారెడ్డిగూడెం నోవా ఇంజినీరింగ్ కాలేజీ, ఎంటెక్ ఖమ్మంలో చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయ ఉద్యోగాల కోసం నిర్వహించిన పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉంగుటూరు మండలం వెల్లమిల్లి సచివాలయంలో గ్రేడ్-5 సెక్రటరీగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తూనే ఎపిపిఎస్‌సి పరీక్షలకు హాజరై సత్తా చాటింది. అంతకుముందు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టిఎస్‌ఎస్‌సి పోటీ పరీక్షల్లో నేరుగా పంచాయతీ కార్యదర్శి ఉద్యోగానికి సంధ్యాదేవి ఎంపికైనా స్వరాష్ట్రం వదిలి వెళ్లకుండా ఇక్కడే అనేక పోటీ పరీక్షల్లో సత్తా చాటిన సంధ్యాదేవిని గ్రామస్తులు అభినందించారు. ఆమె భర్త ఓ ప్రయివేట్ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. తండ్రి పివి.పెద్దిరాజు సీనియర్ పాత్రికేయుడు, ఆర్ఎంపి వైద్యుడు. తల్లి సాధారణ గృహిణి.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టపరచాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, లేకుంటే బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఎపి వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ ఉపాధి హామీచట్ట పరిరక్షణకు ఈ నెల నాలుగో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకూ జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం, బుట్టాయగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు జీలుగుమిల్లి, టి.నరసాపురం, కామవరపుకోట, ద్వారకాతిరుమల మండలాల ఉపాధి హామీ పని ప్రదేశాల్లో పర్యటించి కూలీల సమస్యలు తెలుసుకున్నామన్నారు. గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందన్నారు. బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు నేషనల్ మొబైల్ మోటరింగ్ ఫోటో సిస్టం, రెండు పూటలా పని విధానం తీసుకొచ్చిందన్నారు. కరోనా సమయంలో పేదల ఆకలి చావులు సంభవించకుండా కాపాడిందన్నారు. దళిత గిరిజనులకు, మహిళలకు ఆర్థికంగా చేయూతనివ్వడమే కాకుండా వ్యవసాయ కూలీల వేతనాలు పెరగడానికి అంతిమంగా పేదల ఆర్థికశక్తిని పెంచడానికి దోహదపడిందని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగించిన ఉపాధి హామీ చట్టాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిధులు పెంచి బలోపేతం చేయాల్సిన బాధ్యత కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి ఉండాలని హితవు పలికారు. ఈ చట్టానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడం వల్ల ఏడాదిలో ఒక్కో కుటుంబానికి 22 పని దినాలకు మాత్రమే కేటాయించిన నిధులు సరిపోతాయని తెలిపారు. దీన్నిబట్టి బిజెపి పేదల పట్ల ఎలాంటి వైఖరితో ఉందో ఉపాధి కూలీలంతా గమనించాలన్నారు. బిజెపి పట్ల జగన్ ప్రభుత్వం మెతకవైఖరి వీడాలన్నారు. కూలీలకు వ్యతిరేకంగా ఉన్న పార్టీలను గద్దె దించుతావని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ ధర్నాలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు తామ ముత్యాలమ్మ, వై.నాగేంద్రం, ఆర్.డానియేలు, ఎ.ప్రభాకర్‌రావు, యాగంటి సీత, కారం దుర్గ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, కార్యదర్శి డి.రమేష్, తెల్లం దుర్గారావు, సిఐటియు నాయకులు మడివి దుర్గారావు, జి.వెంకట్రావు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో..



భీమడోలు మండలంలో..

ప్రమాదంలో ఉపాధి హామీ చట్టం

నూజివీడు రూరల్: కోట్లాది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.నరసింహ అన్నారు. బుధవారం పల్లెర్లమూడి గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశాల్లో ఆయన పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో సిస్టం, రెండు పూటలా పని విధానం తీసుకువచ్చిందని విమర్శించారు. కూలీలకు వేతనాలు, సమ్మర్ అలవెన్స్, మేట్ల పారితోషికం నిలిపివేసి, ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులకు పాల్పడుతుందన్నారు. కరోనా సమయంలో పేదల ఆకలిచావులు సంభవించకుండా కాపాడిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో బిజెపి రూ.30వేల కోట్లు నిధులు తగ్గించి ఉపాధి హామీ పీక నొక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.లక్ష్మయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

12న వ్యకాస ధర్నాకు సిఐటియు మద్దతు

భీమడోలు: ఉపాధి హామీ చట్ట రక్షణకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలు చేపడుతున్న ధర్నాకు సిఐటియు మద్దతిస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు తెలిపారు. ఈనెల 12వ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ఈ ధర్నాకు పెద్దఎత్తున కూలీలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉపాధి హామీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించేందుకు ఆయన బుధవారం పొలసానిపల్లిలో పర్యటించారు. చెరువు వద్ద పనుల్లో పాల్గొన్న కూలీలను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీకి బిజెపి ప్రభుత్వం నిధులను తగ్గించిందని, అనేక షరతులు విధించి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే రెండు పూటలా పని విధానం, ఫొటో అప్‌లోడ్ వంటి విధానాలు తీసుకొస్తుందని పేర్కొన్నారు. కూలీలకు వేసవి ప్రత్యేక అలవెన్స్, మజ్జిగ, తాగునీరు, పలుగు, తట్ట వంటివి సరఫరా చేయాలన్నారు. ఏడాదికి 200 రోజులు పని, రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీల సంఘ నాయకులు నాగరాజు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.




నూజివీడు మండలంలో..

మొరాయించిన రేషన్ పంపిణీ వాహనం

బియ్యం అందక ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో పెయ్యేరు తదితర గ్రామాల్లో ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమం నిలిచిపోయింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి పంపిణీ చేయాల్సిన రేషన్ పది రోజులు గడచినా పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం కోసం చూసే పేదలు ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు బియ్యం ఎప్పుడు ఇస్తారంటూ వ్యాన్‌కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ప్రతి ఇంటికి వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ కార్యక్రమం జరుగుతోంది. రేషన్ పంపిణీ చేసేందుకు ఉపయోగించే వాహనాలు తరచూ మరమ్మతులకు గురై మొరాయించడంతో పలు గ్రామాల్లో పది రోజులుగా రేషన్ పంపిణీ నిలిచిపోయింది. మండలంలోని పెయ్యేరు ఎండియు ఆపరేటర్ ద్వారా పెయ్యేరు, దాకరం, పేరూరు పంచాయతీలతో పాటు వాటి శివారు గ్రామాలు తేరగూడెం, నాయుడుచెర్వు, రంగాపురం, పెయ్యేరుకాలనీ, అప్పారావు పేట, వైఎస్ఆర్ కాలనీలకు చెందిన కార్డుదారులకు ప్రతినెల రేషన్ పంపిణీ జరుగుతోంది. ఈ నెలలో పై గ్రామాలకు నేటికి రేషన్ పంపిణీ జరగలేదు. దీంతో వృద్ధులు, మంచంపై ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చేసేది లేక పలు గ్రామాలకు చెందిన యువకులు బైక్‌లపై ఐదు ఆరు కిలోమీటర్లు ప్రయాణించి ముదినేపల్లిలో ఉన్న డీలర్ వద్దకు వచ్చి రేషన్ తీసుకెళ్తున్నారు. వృద్ధులు మాత్రం రేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై పలువురు ఎండియు ఆపరేటర్లను వివరణ కోరగా చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని, వాహనానికి మరమ్మతులు చేయించేందుకు అప్పులు పుట్టడం లేదంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మొరాయించిన రేషన్ పంపిణీ వాహనం


మానవత్వం చాటిన సిఐ అంకబాబు

ప్రజాశక్తి- నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వరరావుకు అనారోగ్య సమస్య రావడంతో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న రూరల్ సిఐ ఆర్.అంకబాబు ఆగి వెంకటేశ్వరరావును తన వాహనంలో ఎక్కించుకొని ప్రథమ చికిత్స చేయించారు. మానవత్వం చాటిన సిఐ ఆర్.అంకబాబుకు బాధితుడు వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కలెక్టరేట్ వద్ద టిడిపి ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. తడిసిన ధాన్యాన్ని, మొలకలు వచ్చిన మొక్కజొన్న పొత్తులను, రంగు మారిన మామిడికాయలను రోడ్డుపై గుట్టలుగా పోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో గత పది రోజులుగా కురిసిన అకాల వర్షాలకు రూ.నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, చేతికొచ్చిన పంట నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోజుల తరబడి కురిసిన భారీ వర్షాలతో కోస్తా, రాయలసీమ జిల్లాల్లో పంటలు నీటిలో నాని నష్ట తీవ్రత పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యంతో పాటు మిరప, మొక్కజొన్న, పసుపు, శనగ, వేరుశనగ, మామిడి, అరటి, ఇతర ఉద్యాన పంటలైన బొప్పాయి, నిమ్మ, దానిమ్మ, బత్తాయి దెబ్బతిని రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారని, వర్షాలతో చేలల్లో నీరు నిలవడంతో ధాన్యాన్ని పొలం నుంచి రోడ్డుపైకి చేర్చేందుకు రైతులు అధిక మొత్తం ఖర్చు చేశారని, ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉమ్మడి పశ్చిమ గోదవరి జిల్లాకు సంబంధించి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉన్నా రైతులకు జరిగింది శూన్యమన్నారు. నాయకులు బడేటి రాధాకృష్ణయ్య, ఘంటా మురళి మాట్లాడుతూ మొక్కజొన్న పొత్తులు కల్లాల్లోనే మొక్కలు వచ్చాయని, మిర్చి కూడా కల్లాల మీద పాడయ్యాయని, ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయని, వీటన్నిటికీ నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ, బొరగం శ్రీనివాస్, చింతలపూడి మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాం చంద్రశేషు, పార్లమెంట్ రైతు అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కృష్ణసుందరరావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సుదీర్ఘకాలం అనేక సేవలందించిన ఎ.కృష్ణసుందరరావు గుండెపోటుతో మృతి ఉపాధ్యాయులకు, యుటిఎఫ్ సంఘానికి తీరని లోటని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు, ఆయన ఆఫీస్ బేరర్‌గా చేస్తూ యుటిఎఫ్ సంఘానికి ఎనలేని సేవలందించారని, కృష్ణాజిల్లా యుటిఎఫ్ సంఘంలో ప్రముఖ బాధ్యతలను నిర్వహించడమే గాక, రాష్ట్ర కార్యదర్శిగా అనేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఎ.కృష్ణ సుందరరావు గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జగనన్న ఇళ్లు పూర్తయ్యేదెప్పుడో..!

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ఆవాస్ యోజన పథకం కింద మొదటి విడతగా మండలవ్యాప్తంగా 784 జగనన్న ఇళ్లు మంజూరయ్యాయి. మంజూరైన ఇళ్లకు మొదట్లో రూ.ఐదు వేలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. దీనికిగాను తహశీల్దార్ ఎవిఎస్‌కు, ఎంపిడిఒ, హౌసింగ్ ఎఇ కొన్ని పంచాయతీలు అప్పగించి ఆయా ఇళ్లకు వంద రోజుల్లో పూర్తి చేయాలని ప్రణాళికలు రూపొందించారు. దీనికి సంబంధించి మొదట్లో విడతల వారీగా కొంత మెటీరియల్‌ను లబ్ధిదారులకు అందించడంతో పాటు అధికారుల ఒత్తిడితో ఎక్కడికక్కడ 210 ఇళ్లు బేస్‌మెంట్ వరకు పూర్తి చేయించారు. వారికి మాత్రం మూడో విడతగా రూ.35 వేలు జమ చేశారు. కొన్ని ఇళ్లకు ఇంకా బేస్‌మెంట్ బిల్లులు రావాల్సి ఉందని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో ఇంకా బిల్లులు పడని ఇళ్లు చాలా వరకు ఉన్నాయి. కొంతమంది బయట అప్పులు తెచ్చి మరి ఇల్లు నిర్మాణం చేస్తున్నప్పటికీ బిల్లులు చెల్లింపులు సరిగ్గా జరగకపోవడం, అరకొరగా మెటీరియల్‌ను ఇస్తుండటంతో ఇంటి నిర్మాణం చేయాలంటే భయపడిపోతున్నారు. వంద రోజుల్లో ఇళ్లు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినా బిల్లులు సరిగ్గా పడకపోవడంతో అధికారులు లబ్ధిదారులను ఒత్తిడి చేయలేక అసహనంతో మౌనంగా ఉంటున్నారు.

చిత్రలేఖనంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు బాలల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. పిరమిడ్ ధ్యాన కేంద్రం నుంచి ఎం.లక్ష్మి శ్వాసపై ధ్యాన అనే అంశాన్ని వివరించారు. అభివృద్ధి కమిటీసభ్యులు చినవెంకటరామయ్య విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. గ్రంథాలయాన్ని జిల్లా కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు సందర్శించి వేసవి శిబిరం గురించి విద్యార్థులతో మాట్లాడుతూ గ్రంథాలయాలను వినియోగించుకుని పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన మైనేని కృష్ణారావు బుధవారం ఉదయం రూ.లక్ష విరాళం ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావుకు అందించారు. అనంతరం దాత కుటుంబసభ్యులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. దాతకు దేవస్థానం వారు అన్నదాన బాండ్ పేపర్స్ అందించారు.

రైతులను కించపరచడం సరికాదు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రైతులను ఎర్రి పప్పలుగా సంబోధించిన మంత్రి తక్షణం రాజీనామా చేయాలని నూజివీడు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ముసునూరు రాజా డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ నూజివీడు తాసిల్దార్ కార్యాలయం లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు.

హెచ్‌ఆర్‌ఎ పెంపుపై హర్షం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విభజించిన జిల్లా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12 శాతం హెచ్‌ఆర్‌ఎను 16 శాతానికి పెంచడం పట్ల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నెరుసు రామారావు బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో పనిచేస్తున్న సుమారు పది వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈ పెంపు వర్తిస్తుందని, త్వరలోనే సరెండర్ లీవులకు సంబంధించిన సుమారు రూ.ఐదు వేల కోట్లను ఖాతాలో జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు ఈ మేరకు హామీ ఇచ్చారని వారు తెలిపారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలులోని శ్రీ రత్నా డిగ్రీ కళాశాల, శ్రీ మాధురి జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్లు, సిబ్బంది నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కరస్పాండెంట్ కె.ప్రేమ్‌కుమార్ తెలిపారు. కళాశాలలో ఏడు లెక్చరర్ పోస్టులు, మూడు సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తుదారులకు ఈ నెల 14వ తేదీన ఇంటర్వ్యూలు, వారికి కేటాయించిన అంశాల్లో డెమో ప్రదర్శన ఉంటాయన్నారు. వివరాలకు కళాశాల కరస్పాండెంట్ కె.ప్రేమకుమార్ 6305751086, 08829 299123 సంప్రదించాలని కరస్పాండెంట్ తెలిపారు.

భూ హక్కు పత్రంపై అవగాహన

ప్రజాశక్తి - భీమడోలు

శతాబ్ద కాలం తర్వాత భూ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు పత్రం కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. పొలసానిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న శాశ్వత భూహక్కు పత్రంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భీమడోలు తహశీల్దార్ షంషుద్దీన్ మాట్లాడుతూ మండల పరిధిలోని 11 రెవెన్యూ గ్రామాల్లో భూహక్కు పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా డ్రోన్ సర్వే కార్యక్రమం పూర్తి అయిందన్నారు. 11వ తేదీన కురెళ్లగూడెం, అంబరుపేట, 12వ తేదీన దుద్దేపూడి, కోడూరుపాడు గ్రామాల్లో కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమారి, విఆర్‌ఒ సింహాచలం, ఎంపిటిసి సభ్యులు ఎ.దేవినాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన యువతి మహమ్మద్ తస్లీమా ఖాన్ ఈ నెల ఆరో తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి రూహుల్లా ఖాన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

జాతీయ రహదారి చేబ్రోలు ఎఎంసి చెక్‌పోస్టు వద్ద బుధవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయాలపాలయ్యారు. చేబ్రోలు రైల్వే గేటు వైపు నుంచి ద్విచక్రవాహనంపై ఏలూరు వైపు రోడ్డులోకి తిరుగుతుండగా ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్లే కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన భార్యాభర్తలను స్థానికులు హైవే అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ

నూజివీడు రూరల్ :మండలంలోని జంగంగూడెం వ్యవసాయ భూమిలో ఉన్న 15 కెవి సామర్థ్యం కలిగిన మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు దుండగులు దొంగిలించారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి తీగను అపహరించుకుపోయారు. విద్యుత్ అధికారులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.


విద్యార్థులను సత్కరిస్తున్న వెంకటరెడ్డి

విద్యార్థులకు సత్కారం


ప్రజాశక్తి - పోలవరం

పదో తరగతి ఫలితాల్లో పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పోతుల రాముడు 573, షేక్ ఇర్ఫాన్ అలీ 573 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి వారి ఇరువురిని బుధవారం శాలువల కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి పదో తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభను కనబరిచి మండలంలోని ప్రథమ స్థానం సాధించడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జల్లేపల్లి వెంకట నరసింహరావు, పోతుల శ్రీనివాస్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి వాటర్ ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని బెస్తావీధిలో నూతనంగా సత్యసాయిబాబా వాటర్ ట్యాంకును సర్పంచి పొడుం పుష్ప, ఉప సర్పంచి కొరసిక శ్రీను, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి పుష్ప మాట్లాడుతూ పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో వాటర్ ట్యాంకును నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ


సహకార బ్యాంకును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

సచివాలయ సహకార బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చనుబండ గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, సహకార బ్యాంకును చనుబండ కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు మోరంపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం సచివాలయం-1ను గ్రామ సర్పంచి విషంపల్లి జ్యోతి ఆధ్వర్యంలో ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం చిన్నంపేటలో గ్రామ సచివాలయ సహకార బ్యాంకును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు, ఎంపిడిఒ ఎన్.మురళీ మోహన్, ఇఒపిఆర్‌డి నాగరాజు, గ్రామ సర్పంచి విషంపల్లి జ్యోతి, వైసిపి నాయకులు కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు మోరంపూడి నాగేశ్వరరావు, జల్లేపల్లి పరమేశ్వరరావు, వనమా వాసు, ఒంకిని వెంకటేశ్వరరావు, పరస చెన్నారావు, పరస ధనలక్ష్మి, మిద్దె రాధ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టి.రామ్మూర్తి

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి హెచ్చరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి అధ్యక్షతన బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామ్మూర్తి మాట్లాడుతూ బాల్యవివాహం చట్ట విరుద్ధమని, బాల్య వివాహానికి సహకరించినవారు, తల్లిదండ్రులు ప్రోత్సాహించిన వారు కూడా శిక్షార్హులని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మోదుగు సునంద, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పి.అంకంపాలెం పంచాయతీలో పర్యటించారు. పంచాయతీలో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని స్థానికులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే డ్రెయినేజీకి నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. పలువురు ఇళ్లు లేవని అడగడంతో ఇళ్లు మంజూరు చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, వైస్ ఎంపిపి ఎస్.శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను, ఎంపిడిఒ మంగతాయారు, వైసిపి సీనియర్ నాయకులు సందా ప్రసాద్, బోదా శ్రీనివాస్ రెడ్డి, కుంజరాముడు, ఉప్పల రాంపండు, ఆకుల రవి, వినయ్, బయ్య వెంకట్రావు, సుధాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించండి సారూ..!


రెవెన్యూ అధికారుల నిర్వాకంతో మహిళ ఆవేదన
50 ఎకరాల పొలం ఉన్నట్లు ఆన్‌లైన్ నమోదు
అందని పథకాలు


కుమారుడు, కుమార్తెతో సావిత్రి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని దొరమామిడి గ్రామానికి చెందిన మహిళ కొప్పుల సావిత్రి భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. తన భర్త చనిపోయినప్పటి నుంచి ఆమె కూలీ పని చేసుకుంటూ తన పిల్లలను చదివిస్తూ పోషించుకుంటుంది. రెవెన్యూ అధికారులు ఆమెకు 50 ఎకరాల పొలం ఉందని తప్పుగా ఆన్‌లైన్ నమోదు చేశారు. తనకు 70 సెంట్లు మాత్రమే ఉందని మహిళ చెబుతోంది. కాని ఆన్‌లైన్‌లో తనకు 50 ఎకరాలు ఉన్నట్లు నమోదు అవ్వడంతో వితంతువు అయిన తనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అమ్మఒడి వంటి ఏ విధమైన పథకాలు అందడంలేదని వాపోతుంది. రేషన్ కార్డు కూడా రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఈ విషయంపై తహశీల్దార్‌ను అడగగా కలెక్టర్‌కి పంపించామని తెలిపారని చెప్పింది. రెండేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా తన సమస్య పరిష్కారం కావడంలేదని వాపోతుంది. సమస్యను స్థానిక ఎంఎల్ఎ తెల్లం బాలరాజు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అధికారులు, పాలకులు స్పందించి తనకు న్యాయం చేయాలని మహిళ కోరుతోంది.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం


కోర్లగుంటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం

ప్రజాశక్తి - ముసునూరు

రైతు భరోసా కేంద్రం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.1962కు మొక్కజొన్న కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ బి.ఆదినారాయణ, ఎపి మార్క్‌ఫెడ్ డిఎం ప్రసాద్ తెలిపారు. మండలంలోని కోర్లగుంట గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ బి.ఆదినారాయణ మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మూల్పురి నాగమల్లేశ్వరరావు, సర్పంచి నక్కనబోయిన సత్యనారాయణ, ఎంపిటిసి వి.సుందరరావు, వ్యవసాయాధికారి సిహెచ్.శ్రీనివాసరావు, పిఎసిఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల తయారీ యూనిట్లకు రుణాలు

ప్రజాశక్తి - భీమడోలు

వైఎస్ఆర్ క్రాంతి పథం ద్వారా అమలవుతున్న జీవనోపాధులు పథకంలో భాగంగా ఆహార పదార్థాల తయారీ యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేయనున్నట్లు భీమడోలు ఎపిఎం సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండల సమాఖ్య నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని వివిధ ప్రధాన శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. వారి కార్యాలయాల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో మండల సమాఖ్య సభ్యుల భాగస్వామ్య అవసరం గురించి వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎపిఎం మాట్లాడుతూ జీవనోపాధులు పథకం కింద ఒక్కొక్క యూనిట్‌కు సుమారు రూ.పది లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. దీనిలో 35 శాతం రాయితీగా ఉంటుందన్నారు. యూనిట్ స్థాపనకు ఆసక్తి గలవారు తన కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇదే క్రమంలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా మంజూరైన జగనన్న గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వచ్చిన 1730 మందికి తమ కార్యాలయం ద్వారా ఒక్కొక్కరికి రూ.35 వేలు రుణాలుగా అందించామన్నారు. మరొక 56 మందికి రుణాల మంజూరు చేస్తే నూరుశాతం లబ్ధిదారులకు రుణాల మంజూరు పూర్తవుతుందన్నారు. రుణ గ్రహీతలు తమ బ్యాంకు ఖాతాలో గల పొదుపు నిల్వలు, గృహ నిర్మాణాల ప్రగతి ఆధారంగా మరొక విడత రుణాలను తమ కార్యాలయం ద్వారా పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ భీమడోలు ఎఇ.సతీష్, పిఆర్ ఎఇ డిఎ సత్యనారాయణ పాల్గొన్నారు.

దిశాపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - భీమడోలు


ఆపద సమయాల్లో మహిళలు, చిన్నారులు దిశ యాప్ వినియోగించడం ద్వారా రక్షణ పొందవచ్చని భీమడోలు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దిశయాప్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు మెగా డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా భీమడోలు జంక్షన్, రైల్వే గేటు, పొలసానిపల్లి, ఫ్లై ఓవర్ ప్రాంతాల్లో మహిళలకు, విద్యార్థినులకు దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకునే విధానం పట్ల అవగాహన కల్పించారు. ఈ మేరకు ముందుకు వచ్చిన కొందరికి యాప్ డౌన్‌లోడ్ విషయమై సహకరించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎఎస్ఐలు చలపతిరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముసునూరు :ప్రతిఒక్కరూ దిశా యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎం.కుటుంబరావు అన్నారు. మండలంలోని గోపవరం గ్రామంలో నాగేంద్రపురం సెంటర్ వద్ద ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి దిశ యాప్‌పై అవగాహన కల్పించారు.

టి.నరసాపురం :ప్రతిఒక్కరూ దిశ యాప్‌ను కలిగి ఉండాలని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా దిశ యాప్ మెగా డ్రైవ్‌ను నిర్వహించాలని జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని బొర్రంపాలెం, టి.నరసాపురం, మక్కినవారి గూడెం గ్రామాల్లో దిశ యాప్‌పై ప్రజలకు ఎస్ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళా పోలీసులు, కానిస్టేబుళ్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్‌లో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల ప్రతిఒక్కరికీ భద్రత ఉంటుందని తెలిపారు.


భీమడోలులో....

సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌ఎకు వినతి


ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందిస్తున్న ఆనందం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావుకు సిపిఎం మండల కమిటీ సభ్యులు కొమ్ము ఆనందం వినతిపత్రం అందించారు. చిన్నంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, సహకార బ్యాంకును ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు సిపిఎం మండల కమిటీ సభ్యులు కొమ్ము ఆనందం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కొమ్ము ఆనందం మాట్లాడుతూ కోపరేటివ్ ఫారంలో ఉన్న కోనేరు రంగారావు విగ్రహం వద్ద నుంచి అప్పారావు ట్యాంక్ వరకు రోడ్డు శిథిలమై పెద్ద పెద్ద గోతులు పడి చిన్న వర్షం పడినా మోకాళ్ల లోతు బురద ఏర్పడి వాహనాలు, పాదచారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సమస్యపై డిసెంబర్ 30వ తేదీన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వినతిపత్రం అందించామని తెలిపారు.

ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి : ఎఐటియుసి

ఏలూరు అర్బన్ :కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, వ్యతిరేక విధానాలపై ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణపై కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలకు సంసిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర కార్య నిర్వహక అధ్యక్షులు చలసాని వెంకటరామారావు పిలుపు నిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవనంలో ఎఐటియుసి జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం ఎఐటియుసి కో-కన్వీనర్ తొర్లపాటి బాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట రామారావు మాట్లాడుతూ 103 ఏళ్ల చరిత్ర కలిగిన ఎఐటియుసి నాయకత్వాన ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక చట్టాలను కాల రాస్తుందని విమర్శించారు. ఇటీవల కేంద్ర కార్మిక సంఘాలు ఢిల్లీలో సమావేశమై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆగస్టు 9 క్విట్ ఇండియా దినోత్సవం నాడు దేశవ్యాప్తంగా హర్తాళ్ నిర్వహించడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో కడపలో ఎఐటియుసి రాష్ట్ర సమితి సమావేశాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలుగా మార్చిన నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎఐటియుసి మహాసభలు జూన్ 18, 19 తేదీల్లో ఏలూరులో జరపాలని కన్వీనింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, సిపిఐ ం జిల్లా కార్య దర్శి మన్నవ కృష్ణచైతన్య ఎఐటియుసి జిల్లా కో-కన్వీనర్ చాట్ల పుల్లారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాస్, కమిటీ సభ్యులు పుప్పాల కన్నబాబు, రెడ్డి శ్రీనివాస్ డాంగే, కంకిపాటి బుచ్చిబాబు పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ సిబ్బందికి సత్కారం

జీలుగుమిల్లి : ఉమ్మడి పశ్చిమ గోదావరి పారా పశుసంవర్ధక శాఖ సిబ్బంది సంఘం ఎన్నికల్లో జీలుగుమిల్లి ప్రాంతీయ పశు వైద్యశాలకు చెందిన నలుగురికి జిల్లాస్థాయిలో పదవులు వచ్చినట్లు పశు సంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.సాయిబుచ్చారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సత్యనారాయణ విఎల్‌ఒల అసోసియేషన్‌కి వైస్ ప్రెసిడెంట్‌గా, అమ్ములు జెవిఒ అసోసియేషన్‌కి ఇఒగా, ఎన్.రాజు ఎల్ఎస్ఎ అసోసియేషన్‌కి వైస్ ప్రెసిడెంట్‌గా, భవాని విఎ అసోసియేషన్‌కి జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. జీలుగుమిల్లి మండలానికి చెందిన నలుగురు జిల్లావ్యాప్తంగా పదవులు పొందటంపై పశువైద్య శస్త్ర చికిత్సకులు డాక్టర్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో వారిని పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు పశు వైద్య శాస్త్ర చికిత్సాకులు డాక్టర్ బిఆర్.శ్రీనివాసన్, పశు సంవర్ధక సిబ్బంది నాగు, పుష్పలత పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామాల్లో ఇంటింటా సేకరించిన చెత్తను విధిగా ఎస్‌డబ్ల్యుపిఎం షెడ్‌లకు తరలించి అక్కడ తడిపొడి చెత్తను వేరుచేసి కంపోస్టు ఎరువులు తయారు చేయాలని ఉంగుటూరు మండల పంచాయతీ విస్తరణాధికారి షేక్ షంషుద్దీన్ అన్నారు. బుధవారం గోపీనాథపట్నంలో సంపద సృష్టి కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. వర్మీకంపోస్టు తయారీ విధానంపై సమీక్షించారు. సర్పంచి విష్ణుమూర్తి, సచివాలయ సెక్రటరీ బ్రహ్మానందరావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

'వైసిపి బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలో, పట్టణంలో వైసిపిని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ అనుబంధ విభాగాల నాయకులు తమ వంతు కృషి చేయాలని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ రానున్న రోజులు ఎంతో క్లిష్టమైనవని ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.